
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY


5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

బుధవారం 17 జనవరి 2024



కోడేరు మండలం ఎత్తం గుట్టపై వెలిసిన రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఊరూ వాడా సంబురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా సంక్రాంతి వేడుకలు



ఊట్కూర్‌లో ముగ్గు వేస్తున్న మహిళలు




మహబూబ్‌నగర్‌లో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం వాకిళ్లలో రంగు రంగుల ముగ్గులను వేశారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత పిండి వంటలు చేసుకొని ఆరగించారు. సాయంత్రం ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అలంపూర్ జోగుళాంబ, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోడేరు మండలం ఎత్తం గట్టుపై 2,500 అడుగులపైన వెలిసిన రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఏటా సంక్రాంతికి ఇక్కడ మకర జ్యోతి వెలిగిస్తారు. మంగళవారం విందు భోజనాలు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా పండుగకు స్వగ్రామాలకు రావడంతో పల్లెలు జన సందడిగా మారాయి.

– ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు





వెల్దండ మండలం కుప్పగండ్లలో హరిదాసు; నారాయణపేటలో ముగ్గు వేస్తున్న మహిళ



ఎత్తం గుట్టపై వెలిసిన రామలింగేశ్వరస్వామి



కొత్తకోట మండలం నిర్వెన్ గ్రామంలో ఎద్దుల బండ్ల ఊరేగింపు



మహబూబ్‌నగర్‌లో.. అయోధ్య రామాలయం, ఆంజనేయుడు, రాముడు, ప్రధాని మోదీ చిత్రాలతో ముగ్గు వేసిన మహిళలు



బిజినేపల్లి: పాలెంలో ఎద్దుల బండ్ల ప్రదర్శన





మహబూబ్‌నగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

బీజేపీ వైపు భరత్ చూపు?

– బంగారుశ్రుతి, పోతుగంటి భరత్‌ల గెలుపు అవకాశాలపై సెంట్రల్ ఇంటలిజెన్సీ ఆరా



పోతుగంటి భరత్‌ప్రసాద్



బంగారు శ్రుతి

నాగర్‌కర్నూల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలపై బీజేపీ అధిష్ఠానం దృష్టి కేంద్రీకరించింది. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి గెలుపే లక్ష్యంగా అభ్యర్థిని బరిలో దింపే యోచనలో బీజేపీ అధిష్ఠానం ఉంది. ఈ క్రమంలో బంగారు లక్ష్మణ్ తనయురాలు బంగారు శ్రుతి, ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు తనయుడు పోతుగంటి భరత్‌ప్రసాద్‌లలో ఎవరికీ విజయావకాశాలు అధికంగా ఉంటాయనే అంశంపై సెంట్రల్ ఇంటలిజెన్సీ ఆరా తీయడం మొదలుపెట్టింది. కాంగ్రెస్ నుంచి మల్లురవి, బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ ప్రజాకవి గోరటి వెంకన్న పోటీ చేయడం ఖాయమని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను బీజేపీ నుంచి రంగంలోకి దించితే ఎలా ఉంటుందనే యోచన బీజేపీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి పోతుగంటి రాములు ఎంపీగా కొనసాగుతున్నప్పటికీ బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు తిరిగి ఆయనకు పార్టీ టికెట్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో పోతుగంటి రాములు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాలని కార్యకర్తల నుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ ఆయనకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ కేటాయించే అవకాశం దాదాపు లేదు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన అనుచరుడుగా ఉండడం, గతంలో రెండుసార్లు ఆయన నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు ప్రాతినిథ్యం వహించిన అనుభవం ఉండడంతో దాదాపు ఆయనకే కాంగ్రెస్ టికెట్ ఖరారైనట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి పోటీ చేయడం కోసమే ఆయన జడ్చర్ల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని వదులుకున్నారు. రేవంత్‌రెడ్డితో సాన్నిహిత్యం, మల్లురవి సోదరుడు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో మల్లురవికి నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ వందశాతం ఖరారైనట్లేనని చెప్పవచ్చు. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో అవకాశం లేక బీఆర్ఎస్ నుంచి అవకాశం దక్కే పరిస్థితి లేకపోవడంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో బీజేపీ అధిష్ఠానం రాములు తనయుడు భరత్‌ప్రసాద్ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లురవి, బీఆర్ఎస్ నుంచి గోరటి వెంకన్నలు పోటీ చేస్తే మాల సామాజిక వర్గానికి చెందిన వారవుతారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉండడం కారణంగా పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను రంగంలోకి దించితే బీజేపీకి ఉపయోగకరంగా ఉంటుందని అధిష్ఠానం యోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. యువకుడైన భరత్‌ప్రసాద్‌ను బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దింపితే మోదీ పట్ల యువ తలో ఉన్న క్రేజ్ పార్టీ విజయావకాశాలకనుగుణంగా మలుచుకోవచ్చుననే ఆలోచనలో బీజేపీ అధిష్ఠానం ఉన్నట్లు చెబుతున్నారు. సీనియర్ పార్లమెంటరీయన్‌గా ఎంపీ పోతుగంటి రాములుకు నియోజకవర్గంలో ఉన్న సంబంధాలు బీజేపీకి బాగా దోహదపడుతాయనే ఆలోచనలో బీజేపీ పెద్దలు ఉన్నారు. అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాలలో రాములుకు మంచి పేరు ఉండడం ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూడా పార్లమెంట్ నియోజకవర్గంలో రాములుకు ఉన్న సన్నిహిత సంబంధాలు బీజేపీకి దోహదపడుతాయని ఆ నాయకులు అంటున్నారు. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీ చేసిన బంగారుశ్రుతి దాదాపు లక్షకు పైగా ఓట్లు సాధించారు. ఈసారి బీజేపీ అభ్యర్థిగా భరత్‌ప్రసాద్‌కు అవకాశం కల్పిస్తే ఆమెను ఎలా సర్దుబాటు చేస్తారనే విషయంలో కూడా మీమాంస నెలకొంది. అయితే బంగారు శ్రుతి, భరత్‌ప్రసాద్‌ల విజయావకాశాలపై ఇంటలిజెన్సీ వర్గాలు సూక్ష్మస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరిలో ఎవరూ గట్టి పోటీ ఇస్తారో వారికే టికెట్ కేటాయించేలా అధిష్ఠానం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.

మోడల్ స్కూల్స్ సీట్ల కోసం పోటీ

- ఆ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల బోధన
- ప్రవేశాలకు ఈ నెల 22 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- పరీక్ష ఆధారంగా ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 16: నాణ్యమైన ఆంగ్ల బోధన అందుతున్న మోడల్ స్కూల్స్‌లో సీట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చదువులో వెనుకబడిన మండలాలను గుర్తించి ఈ స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎనిమిది మోడల్ స్కూల్స్‌ను 2013-2014లో ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇవి తెలంగాణ మోడల్ స్కూల్స్‌గా కొనసాగుతున్నాయి. గురుకుల పాఠశాల తరహాలో ఇక్కడ బోధన అందిస్తున్నారు. బాలికలకు హాస్టల్ వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మోడల్ స్కూల్స్ ప్రవేశాలకు ఎక్కువగా పోటీ పడుతున్నారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ మొదటి, ద్వితీయ తరగతులు కూడా కొనసాగుతున్నాయి. ఇంటర్ ప్రవేశాలకు మాత్రం ఆ మండల పరిధిలోని విద్యార్థులకు మొదట అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఇతరులకు మెరిట్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఇస్తున్నారు.

ఒక్కో స్కూల్‌లో 100 సీట్లు

మోడల్ స్కూల్స్‌లో ఏటా ఆరో తరగతిలో 100 సీట్లను భర్తీ చేస్తారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల్లోని ఖాళీ సీట్లను కూడా ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సాధించిన మార్కుల ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పీహెచ్‌సీ కోటా రిజర్వేషన్ ఉంటుంది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 12 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వారికి ఏప్రిల్ ఏడో తేదీన పరీక్ష నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూల్స్ వివరాలు

సంఖ్య	జిల్లా	మండలం
1.	మహబూబ్‌నగర్	గండీడ్ (వెన్నచేడ్)
2.	నారాయణపేట	కోస్గి
3.	నారాయణపేట	ధన్వాడ
4.	నాగర్‌కర్నూల్	కోడేరు
5.	నాగర్‌కర్నూల్	వెల్దండ
6.	వనపర్తి	పెబ్బేరు
7.	వనపర్తి	కొత్తకోట
8.	వనపర్తి	ఖిల్లాఘణపురం

నాణ్యమైన బోధన

మోడల్ స్కూల్స్‌లో నాణ్యమైన ఆంగ్ల బోధన అందుతోంది. మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు అవగాహన కల్పించాలి.

– రవీందర్, మహబూబ్‌నగర్ డీఈవో

మెడికల్ కాలేజీల్లో.. ముందడుగు

- గద్వాల, నారాయణపేట జిల్లాలకు గతేడాది మెడికల్ కాలేజీలు మంజూరు
- ఎన్నికల నేపథ్యంలో ప్రక్రియ ప్రారంభించకపోవడంతో ఆందోళన
- తాజాగా వాటికి ప్రిన్సిపాల్స్‌ను నియమించిన డీఎంఈ
- సిద్ధంకాని జీజీహెచ్ అప్‌గ్రెడేషన్, 300 పడకల ఆస్పత్రులు
- ఎన్ఎంసీ తనిఖీలు పూర్తయితే తరగతుల ప్రారంభానికి లభించనున్న అనుమతి



గద్వాలలో నిర్మిస్తున్న 300 పడకల ఆస్పత్రి

గద్వాల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంలో భాగంగా గతేడాది జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గతేడాది జూలైలో జీవో రాగా.. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో కాలేజీల ఏర్పాటు ఆలస్యమవుతుందనే ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆ రెండు మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నారాయణపేట కాలేజీకి మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల ఆర్థోపెడిక్ విభాగంలో ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ రాంకిషన్‌ను నియమించగా.. జోగుళాంబ గద్వాల జిల్లాకు అదే మెడికల్ కాలేజీలో అనాటమీ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ నవ కళ్యాణిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఈ రెండు మెడికల్ కాలేజీలకు సంబంధించిన ముందుడుగు ఇదేనని చెప్పొచ్చు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికే మూడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే మంజూరైంది. ప్రస్తుతం అక్కడ పీజీ తరగతులకు కూడా అనుమతి లభించింది. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల కోసం పాత కలెక్టరేట్ స్థలంలో ఆస్పత్రి నిర్మాణం కూడా జరుగుతోంది. ఆ తర్వాత 2021 జూలైలో రాష్ట్ర ప్రభుత్వం వనపర్తి, నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2022 అక్టోబరులో నర్సింగ్ కాలేజీ భవనాన్ని తాత్కాలిక మెడికల్ కాలేజీగా మార్చి, అందులో తరగతులను ప్రారంభించారు. ప్రస్తుతం రెండో బ్యాచ్ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ రెండు కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించిన హాస్టళ్లు, అడ్మినిస్ట్రేటివ్, తరగతి గదులు, ల్యాబ్స్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా రెండు బ్యాచుల వరకు ఎన్ఎంసీ అనుమతులు పొందినప్పటికీ.. శాశ్వత భవనాలు పూర్తికాకపోతే మూడో సంవత్సరం తరగతులు ప్రారంభం కావనే ఉద్దేశంతో ఆ పనులను చేపడుతున్నారు.

వేగం పెంచాలి

ప్రతీ జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేయడం ద్వారా మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు స్థానికంగానే సీట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రూ.లక్షల్లో డొనేషన్లు కట్టాల్సి వచ్చే వారికి ఆర్థిక భారం తప్పనుంది. గతంలో నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు.. ఎంబీబీఎస్ చదవడానికి ఫిలిఫిన్స్, ఉక్రెయిన్, పోలాండ్, రష్యా తదితర దేశాలకు వెళ్లేవారు. అక్కడ ఎంబీబీఎస్ చదువు పూర్తి చేసిన వారికి స్థానికంగా ఎన్ఎంసీ నిర్వహించే పరీక్షల్లో పాస్ కావాలనే నిబంధన ఉంది. అయితే ఆయా దేశాల్లో యుద్ధాలు, ఇతరత్రా ఇబ్బందులు ఏర్పడినప్పుడు అక్కడ చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2022 నుంచి కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో కూడా చాలామంది విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఇప్పుడు స్థానికంగా ప్రతీ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు వల్ల ఎంబీబీఎస్ కోసం విదేశాలకు వెళ్లే వారికి ఉపశమనం లభించనుంది. అలాగే ప్రతీ మెడికల్ కాలేజీకి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులను జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ దావాఖాన)గా అప్‌గ్రేడ్ చేయడం వల్ల అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. సుమారు 18 విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పారామెడికల్ స్టాఫ్ అందుబాటులోకి వస్తారు. అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడం వల్ల ప్రైవేటులో రూ.వేలకు వేలు ఖర్చు చేసే సేవలు కూడా ఉచితంగా లభించనున్నాయి. మెడికల్ కాలేజీలు ఏర్పాటైన తర్వాత నుంచి ఐదు సంవత్సరాలు అంటే సుమారు ఒక ఎంబీబీఎస్ బ్యాచ్ పూర్తయ్యేలోపు కాలేజీలకు పీజీ తరగతులకు అనుమతులు వస్తాయి. పనులు ఆలస్యం కావడం వల్ల ఎన్ఎంసీ అనుమతులు లభించడంలో, తరగతులు ప్రారంభించడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. జీజీహెచ్ అప్‌గ్రేడేషన్, 300 పడకల ఆస్పత్రి నిర్మాణం, తరగతులు నిర్వహణ, హాస్టల్స్ సదుపాయాలు త్వరితగతిన కల్పించాలని మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ చేయలే..

ఏ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నా దానికి అనుబంధంగా జనరల్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి. అందుకు సమయం పట్టే అవకాశం ఉండటంతో బ్యాచ్ పెరుగుతున్నా కొద్ది.. శాశ్వత నిర్మాణాలు చేసి, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందే ఆస్పత్రిగా తీర్చిదిద్దుతారు. అయితే తరగతుల ప్రారంభం కోసం కచ్చితంగా ఒక మెడికల్ కాలేజీకి అనుబంధంగా 300 పడకల ఆస్పత్రి ఉండాలి. అప్పుడే నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇస్తుంది. ఇప్పటివరకు మెడికల్ కాలేజీలు ఏర్పాటైన జిల్లాల్లో స్థానిక జిల్లా ఆస్పత్రులను తాత్కాలికంగా అప్‌గ్రేడ్ చేయడం, మాత శిశు సంరక్షణ కేంద్రాలను నిర్మించి, అక్కడి పడకలను ఇందులో కలిపేయడం ద్వారా అనుమతులు తీసుకున్నారు. పీజీకి అనుమతులు వచ్చే సరికి శాశ్వత భవనాలను సిద్ధం చేసేలా ప్రణాళికలు చేసుకుంటున్నారు. అయితే గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మెడికల్ కాలేజీలకు సంబంధించి ఇప్పటివరకు 300 పడకల ఆస్పత్రులు సిద్ధం కాలేదు. అలాగే ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులను ప్రభుత్వ జనరల్ దావాఖానాలుగా అప్‌గ్రేడ్ చేయలేదు. దీనివల్ల ఎన్ఎంసీ బృందం ఈ ఏడాది తరగతుల ప్రారంభం కోసం తనిఖీలు నిర్వహించలేని పరిస్థితి ఉంది. ఒకటి, రెండుసార్లు ఎన్ఎంసీ బృందాలు తనిఖీలు పూర్తి చేస్తేనే మెడికల్ కాలేజీల్లో తరగతుల ప్రారంభానికి అనుమతులు లభిస్తాయి. అయితే నీట్ పరీక్ష వాయిదా పడినందున కౌన్సెలింగ్ కూడా ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జీజీహెచ్ అప్‌గ్రెడేషన్, 300 పడకల ఆస్పత్రిని, విద్యార్థుల కోసం తాత్కాలిక హాస్టల్ వసతిని త్వరితగతిన ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులు జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ చేస్తే.. వైద్యుల నియామకాలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సహకార సిబ్బంది, పారామెడికల్ ఉద్యోగులను నియమిస్తారు. కానీ ఈ రెండు జిల్లాలకు సంబంధించి ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు ప్రారంభం కాలేదని చెప్పవచ్చు.

సీఈసీ నిర్ణయం మేరకు ఎంపీ టికెట్లు

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 16: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పాటు తెలంగాణలోని 17 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ టికెట్‌లను నిర్ణయిస్తుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడారు. మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహించే సీఈసీ పార్లమెంట్ అభ్యర్థులుగా ఎవరు ఉండాలోనని నిర్ణయిస్తుందని చెప్పారు. ఈనెల 22న తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ హరీశ్‌చౌదరి రాష్ట్రానికి వస్తున్నారని వివరించారు. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ అధ్యక్షులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఆ సమావేశంలో రాష్ట్రం నుంచి కొన్ని పేర్లు ప్రపోజ్ చేసి, సీఈసీకి పంపించడం జరుగుతుందన్నారు. సీఈసీ ఎవరిని అభ్యర్థిగా నియమిస్తే వారి గెలుపు కోసం పార్టీ శ్రేణులుగా తామంతా కష్టపడి పని చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు ఆయనే కో ఆర్డినేటర్‌గా ఉన్నందున ఈ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పని చేస్తామని వెల్లడించారు.

ముగిసిన నరసన్న బ్రహ్మోత్సవాలు

-స్వామి వారి సన్నిధికి చేరుకున్న ఉద్దాలు


మెట్ల దారిన తీసుకెళ్తున్న ఉద్దాలు

తిమ్మాజీపేట, జనవరి 16 : తిమ్మాజీపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్న గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. గత మూడు రోజులుగా సుదర్శన హోం, పల్లకీసేవ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం, రథోత్సవం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, భజనలు, బతుకమ్మల కోలాటాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు బంగారుశ్రుతి కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా అన్ని వసతులు కల్పిస్తూ అన్నదానం చేశారు. కాలి నడకన వచ్చే భక్తులకు మెట్ల దారిని వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గాలను ఏర్పాటు చేసిన పార్కింగ్ సౌకర్యం కల్పించారు. పలు గ్రామాల వారు తమ ఎద్దుల బండ్లను ఎంతో ఆనందంగా రంగులతో కొబ్బరి మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. తమ తమ గ్రామాల్లో ఊరేగిస్తూ శ్రీలక్ష్మీనరసింహస్వామి ముఖ ద్వారం ముందర రచ్చకట్ట చుట్టూ పోటీ పడుతూ ప్రదర్శన నిర్వహించారు. వాహనాల ఎద్దుల బండ్ల ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు దేవాలయ ఆవరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రకృతి వ్యవసాయం నైవేద్యాన్ని దాతలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం స్వామి వారి సన్నిధికి ఊరేగింపుగా గోవిందా నామస్మరణ మధ్య ఉద్దాలు చేరుకున్నాయి.

దొంగతనానికి వచ్చి గ్రామస్థులకు పట్టుబడ్డ దొంగ

వెల్దండ, జనవరి 16 : దొంగతనానికి వచ్చి గ్రామస్థులకు చిక్కి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దొంగ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని చంద్రాయన్‌గుట్ట బండ్లగూడ ప్రాంతానికి చెందిన అక్రం (58) అనే వ్యక్తి సోమవారం మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలోని గన్నోజు సత్తయ్య అనే వ్యక్తి దుకాణంలో చోరీకి పాల్పడ్డాడు. ఈ క్రమంలో దుకాణంలో ఉన్న డ్రిల్లింగ్ మిషన్‌ను తీసుకుని వెళుతుండగా సత్తయ్యతోపాటు గ్రామస్థులు అక్రంను పట్టుకున్నారు. గ్రామస్థులు అతన్ని విచారిస్తుండగా తీవ్ర అనారోగ్యంపాలై అయాసపడుతుండడంతో గ్రామస్థులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కల్వకుర్తి, జనవరి 16 : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లికి చెందిన శోభారెడ్డి(56) సొంత పని మీద సోమవారం కల్వకుర్తికి వచ్చింది. ఈ క్రమంలో జడ్చర్ల దేవరకొండ ప్రధాన రహదారిపై వజ్రం కార్ఖానా సమీపంలో శోభారెడ్డి రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం 108లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 16:మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త మేడమోని వెంకటయ్య(55) ఇంట్లో ఉరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ మహేందర్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్య గౌరమ్మను వెంకటయ్య డబ్బులు అడగడంతో తన వద్ద లేవని చెప్పింది. పండుగ పూట ఇంత వరకు తాగింది చాలదా అని గౌరమ్మ చెప్పి బయటకు వెళ్లడంతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన భార్య చుట్టుపక్కల వారిని పిలిపించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

భర్తను చంపిన భార్య, కుమారుడు

- తప్పతాగి రోజూ గొడవలే కారణం


ఎండీ మహమ్మద్ (ఫైల్)

బల్మూరు, జనవరి 16 : వేధింపులను తట్టుకోలేక భర్తను భార్య, కుమారుడు గొడ్డలితో నరికి చంపిన సంఘటన ఆదివారం రాత్రి నాగర్‌కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్నది. బల్మూరు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిధిలోని కొండనాగుల గ్రామానికి చెందిన తాపీమేస్త్రి ఎండీ మహమ్మద్ (48) తరచూ మద్యం తాగి తన భార్య నిరంజన్‌బీ, కుమారుడు పాషను వేధిస్తుండేవాడు. ఆదివారం రాత్రి కూడా మద్యంతాగి వచ్చి ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొని భార్యపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీంతో కోపగించిన ఆమె అదే గొడ్డలిని లాక్కున్నది. కుమారుడు కూడా తోడుకావడంతో ఇద్దరూ కలిసి దాడి చేశారు. తల, మెడకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ చేసి మృతుడి తల్లి కరీమ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూతురికి అవమానం జరిగిందని తండ్రి ఆత్మహత్య

కోడేరు, జనవరి 16 : నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండల పరిధిలోని ఎర్రన్నబావి తండాకు చెందిన బద్యానాయక్ (55) తన కూతురికి అవమానం జరిగిందని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి హైదరాబాద్‌లోని ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఆత్మహత్య చేసుకున్నాడని బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం విలేకర్లకు తెలిపారు. బద్యానాయక్ కూతురు సునీతకు నాగులపల్లి తండాకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. ఇదిలాఉండగా ఐదు రోజుల క్రితం సునీత కుటుంబంలో గొడవలు జరిగాయి. భర్త, మరికొందరు ఆమెను అవమానించారని తండ్రి బద్యానాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య చిన్నమ్మ, ఓ కూతురు, ఇద్దరు కుమారులు పరమేశ్వర్, కుమార్ ఉన్నారు.

సరళాసాగర్ రూపకర్త పేరును పాలమూరు ప్రాజెక్టుకు నామకరణం చేయాలి

- సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పరమేశ్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి16: సరళాసాగర్ సైఫన్ ప్రాజెక్ట్ రూపకర్త ఇరిగేషన్ ఇంజనీర్ పీఎస్ రామకృష్ణరాజు పేరును పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నామకరణం చేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పరమేశ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా 'పాలమూరు ప్రాజెక్టు'కు జైపాల్‌రెడ్డి పేరును కాంగ్రెస్ నాయకులు ప్రతిపాదించడం సరికాదన్నారు. ఈ జిల్లాలో సుప్రసిద్ధ సివిల్ ఇంజనీర్ అయిన రామకృష్ణరాజును వనపర్తి రాజా రామేశ్వరరావు అమెరికాలోని కాలిఫోర్నియాకు పంపించి సైఫన్ సిస్టమ్‌ను స్టడీ చేసి ఇక్కడికి వచ్చి సరళసగర్ ప్రాజెక్ట్‌ను ఆసియా ఖండంలో ఒకటైన సైఫన్‌టెక్నాలజీతో కూడిన ప్రాజెక్ట్‌ను స్వాతంత్ర్యం కంటే ముందే రూపకల్పన చేసిన మహనీయుడన్నారు. ఆయన పేరును రాష్ట్రంలో ఎక్కడా స్మరించుకోలేదని గుర్తుచేశారు. అందుకే రామకృష్ణరాజు పేరును పాలమూరు ప్రాజెక్ట్‌కు నామకరణం చేసి ఆయనను స్మరించుకోవాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు.

ఈదమ్మ జాతరలో అపశ్రుతి

- ఎక్స్‌కవేటర్ కింద పడి వ్యక్తి మృతి


మధు (ఫైల్)

బల్మూరు, జనవరి 16 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని జినుకుంట గ్రామంలో సోమవారం సాయంత్రం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గ్రామంలోని ఈదమ్మ జాతరలో భాగంగా గ్రామంలోని ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర వాహనాలను దేవాలయం చుట్టూ తిరుగుతుండగా అపశ్రుతి జరిగి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జినుకుంట గ్రామానికి చెందిన గోవిందు మధు(40) వ్యక్తి సంబురాల్లో పాల్గొన్న ఎక్స్‌కవేటర్ టైరు కింద పడడంతో మృతి చెందాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ వాహనందారుడు గుండూరు శ్రీశైలం వాహనాన్ని నడుపుతున్నాడని ఎస్‌ఐ తెలిపారు. ముందు భాగంలో ఉన్న డోజింగ్‌లో కూర్చొని యువకుడిపై నుంచి కిందికి జారిపడి టైరు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని వారు తెలిపారు. మృతుడు భార్య పద్మ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నట్లు వారు తెలిపారు.

కృష్ణానది పుట్టి ప్రమాదానికి రేపటితో 17ఏళ్లు


కొల్లాపూర్, జనవరి 16 : ఏరులై పారే సోమశిల కృష్ణానదిలో ఉట్టి ప్రయాణం చేస్తూ 61మంది జల సమాధి అయిన దుర్ఘటన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం మొత్తం ఒక్కసారి ఉలిక్కి పడ్డ ఘటనకు రేపటితో 17ఏళ్ల పూర్తి కానున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లా కొల్లాపూర్ మండలంలో సింగోటం గ్రామంలో ప్రతి ఏడాది జనవరి నెలలో 18వ తేదీన నిర్వహించే సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యేందుకు 2007 జనవరి 18వ తేదీన సీమాంధ్ర భక్తులు కృష్ణానదిలో పుట్టి ప్రయాణం చేస్తూ ఉమ్మడి కొల్లాపూర్ మండలంలోని మంచాలకట్ట గ్రామం కృష్ణానదిలో మూడాకొండ సమీపంలో పుట్టి మునిగి 61మంది జల సమాధి అయిన సంఘటనకు ఈ నెల 18వ తేదీకి నిండా 17ఏళ్ల పూర్తి కానున్నాయి. వైభవంగా నిర్వహించే సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భక్తులతోపాటు సీమాంధ్ర భక్తులు కూడా పెద్ద ఎత్తున హాజరవుతారు. రాయలసీమకు చెందిన నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి భక్తులు కృష్ణానదిపై మరబోటు ప్రయాణం చేసి మంచాలకట్ట గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి సింగోటంలో లక్ష్మీనరసింహుని దర్శించుకుని తిరుగు ప్రయాణం చేస్తారు. ఈ ఏడాది మరబోటు ప్రయాణం పట్ల పోలీసులు ఆంక్షలు విధించడంతో సీమాంధ్ర భక్తులు కర్నూల్, పెబ్బేరు మీదుగా కొల్లాపూర్‌కు చేరుకుని లక్ష్మీనరసింహుని దర్శించుకుని 2007లో జరిగిన దుర్ఘటనతో కృష్ణానదిపై వంతెన నిర్మించాలని 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి కొల్లాపూర్ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ముందు శిలాఫలకం ఆవిష్కరించారు. వంతెన నిర్మాణం కోసం టెండరు దక్కించుకున్న గుత్తేదారులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం సోమశిల, సిద్దేశ్వరం రెండు కొండల మధ్య తీగల వంతెన కోసం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. టెండర్లు ఇంకా పిలవకపోవడంతో ఈ ఏడాది పనులు ప్రారంభం కాలేదు. వచ్చే ఏడాదైనా కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణం జరిగితే ప్రతి ఏడాది సింగోటం లక్ష్మీనరసింహస్వామి జాతరకు వచ్చే సీమాంధ్ర భక్తులతోపాటు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

సీజ్ చేసిన ఇసుక డంపులకు నేడు వేలం

జడ్చర్ల, జనవరి 16 : జడ్చర్ల మండలం గంగాపురం శివారులో ఈ నెల 4న సీజ్ చేసిన ఇసుక డంపును బుధవారం వేలం వేయనున్నట్లు జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గంగాపురం శివారులో 80 ట్రాక్టర్ల (240క్యూబిక్ మీటర్లు) ఇసుకను జడ్చర్ల పోలీసులు సీజ్ చేశారని పేర్కొన్నారు. ఇసుకను జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ

- రెండున్నర తులాల బంగారం, 15తులాల వెండి అపహరణ


పుల్లయ్య ఇంట్లో దుండగులు చల్లాచెదురుగా వేసిన వస్తువులు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 16 : ఒకే రోజు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన తెలుసుకున్న స్థానిక సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న లింగయ్య, చంద్రశేఖర్‌కు సంబంధించిన రెండిళ్లలో, జీవన్, పుల్లయ్య ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. రెండున్నర తులాల బంగారం, 15తులాల వెండి అపహరించుకుపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. పండుగ సందర్భంగా ఊరికెళ్లడంతో ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనపై పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

ప్రముఖ వ్యాపారి తీగల వెంకట్రాములు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 16 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పౌల్ట్రీ వ్యాపారి తీగల వెంకట్రాములు(75) మంగళవారం ఉదయం మృతి చెందాడు. చికెన్ సెంటర్ వ్యాపారంలో ఆయనకు మంచి పేరు ఉంది. దీనికి తోడు హజరత్ సయ్యద్ హుస్సేన్ హారోని (దూలేపాషా) సాహెబ్‌కు శిష్యుడుగా ఉంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకునేవారు. వెంకట్రాములు మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్నూరు సంఘం పెద్దలు, ఆధ్యాత్మిక గురువు దూలే పాషా శిష్య బృందం తదితరులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు బుధవారం శ్రీపురం రోడ్డులోని వారి వ్యవసాయ క్షేత్రంలో జరుగుతాయని ఆయన కుమారుడు మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తీగల సుభాష్ తెలిపారు.

అట్టహాసంగా ఎద్దుల బండలాగుడు పోటీలు


పెద్దకొత్తపల్లిలో ఎద్దుల బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతిని అందజేస్తున్న మంత్రి జూపల్లి

పెద్దకొత్తపల్లి, జనవరి 16 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరి విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. ఈ పోటీలను టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్ రావు ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. గద్వాల జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన చంద్రన్న ఎద్దులు 3వేల 954.02ఫీట్ల దూరం బండలాగి ప్రథమ బహుమతి 50వేల రూపాయలు గెలుచుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన అనన్యరెడ్డి ఎద్దులు 3వేల 595.08ఫీట్ల దూరం బండలాగి ద్వితీయ బహుమతి 40వేలు గెలుచుకున్నాయి. గద్వాల జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన అజయ్ ఎద్దులు 3వేల 500ఫీట్ల దూరం బండలాగి మూడవ బహుమతి 30వేల రూపాయలు గెలుచుకున్నాయి. గద్వాల జిల్లా మల్దకల్ మండలం అడవిరాయలచెరువు వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు రాముడు ఎద్దులు 3వేల 245ఫీట్ల దూరం బండలాగి 4వ బహుమతి 20వేలు గెలుచుకున్నాయి. కర్నూల్ జిల్లా ఏనగండ్ల గ్రామానికి చెందిన జానకిరామ్ ఎద్దులు 3వేల 62ఫీట్ల దూరం బండలాగి 5వ బహుమతి 10వేలు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందజేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండునరసింహ, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, సీపీఐ జిల్లా నాయకులు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, ఎంపీటీసీ శశికళ, మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్‌రావు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

● పెద్దకార్పాములలో..

మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగైపోతున్న వ్యవసాయ రంగం, పశు సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత రైతాంగంపై ఎంతైనా ఉందన్నారు. బండలాగుడు పోటీల్లో గద్వాల జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన చంద్రన్న ఎద్దులు 3వేల 805.06ఫీట్ల దూరం బండలాగి ప్రథమ బహుమతి 50వేలు, గద్వాల జిల్లా గొర్లకాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రప్ప ఎద్దులు 3వేల 689.02ఫీట్ల దూరం బండలాగి 2వ బహుమతి 40వేలు రూపాయలు, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన అచ్చలారెడ్డి ఎద్దులు 3వేల 286.04ఫీట్ల దూరం బండలాగి 3వ బహుమతి రూ. 30వేలు, నంద్యాల జిల్లా వెలుగోడు గ్రామానికి చెందిన జేఎండీ.బుల్స్ ఆయుబ్‌బాషా ఎద్దులు 3వేల ఫీట్ల దూరం బండలాగి 4వ బహుమతి రూ. 20వేలు, కర్నూల్ జిల్లా ఏనగండ్ల గ్రామానికి చెందిన జానకిరాముడు ఎద్దులు 2వేల 819.1ఫీట్ల దూరం బండలాగి 5వ బహుమతి రూ. 10వేలు, గద్వాల జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన అజయ్ ఎద్దులు 2వేల 765.4ఫీట్ల దూరం బండలాగి 6వ బహుమతి రూ. 8వేలను అందుకున్నారు. బహుమతులను ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ చైర్మన్ మెరుగురాజు, సర్పంచ్‌లు వి.సత్యం, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యులు సొంటె ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఫాస్ట్ - 5 నెట్‌బాల్ చాంపియన్ హర్యానా

- రన్నర్‌గా తెలంగాణ, కర్ణాటక - మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ మహిళా జట్టు


రన్నర్ తెలంగాణ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 16 : జాతీయ నెట్‌బాల్ క్రీడా పోటీలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగాయి. నేషనల్ ఫాస్ట్ -5 సీనియర్ మహిళలు, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ పురుషుల విభాగంలో హర్యానా జట్టు 32-20 తేడాతో తెలంగాణ జట్టుపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. తెలంగాణ జట్టు రన్నర్‌గా నిలిచింది. మహిళా విభాగంలో హర్యానా జట్టు 43-23 పాయింట్లతో కర్ణాటక జట్టుపై గెలిచి చాంపియన్‌గా నిలువగా, కర్ణాటక రన్నర్‌గా నిలిచింది. మహిళా విభాగంలో తెలంగాణ, ఢిల్లీ, పురుషుల విభాగంలో డిల్లీ, కేరళ మూడో స్థానంలో నిలిచాయి.

గెలుపు ఓటములు సమానం : ఎమ్మెల్యే యెన్నం

క్రీడల్లో గెలుపు, ఓటములు సమానమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీ నిర్వహించడం పట్ల నెట్‌బాల్ ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహనకు దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉన్నదన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి పోటీలలో దేశంలోని 28 రాష్ట్రాల క్రీడాకారులు అతిథ్యం ఇవ్వడం పాలమూరు, ప్రేమ ఆప్యాయతలను పొందారన్నారు. క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందన్నారు. ఇలాంటి టోర్నీలు ప్రతీ ఏట నిర్వహించాలన్నారు. ఈ టోర్నీలో అన్ని రాష్ట్రాల క్రీడాకారులు చక్కని ప్రదర్శన ఇచ్చారని గుర్తు చేశారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందన్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదన్నారు. జిల్లాకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి విజేందర్‌సింగ్, టోర్నీ చైర్మన్ అమిత్ అరోరా, కన్వీనర్ ఆకాష్‌బత్ర, నెట్‌బాల్ ఫెడరేషన్ ఎంపైర్ బోర్డు చైర్మన్ అశోక్ ఆనంద్, డీఎస్‌వో శ్రీనివాస్, రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉపాధ్యక్షులు సాదత్‌ఖాన్ పాల్గొన్నారు.

కల్లు డిపో గోడౌన్‌కు నిప్పు


నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన కల్లు డిపో గోడౌన్ షెడ్డు

గద్వాల/ గద్వాల క్రైం, జనవరి 16 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం సమీపం నదీ అగ్రహారం రోడ్డులో ఉన్న కల్లు డిపో గోడౌన్‌కు సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధితులు ఆనంద్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లు సీసాలు, పెట్టలతో పాటు ఇతర వస్తువులను నిల్వ చేసుకోవడానికి వారు తమ స్వంత పొలంలో షెడ్డు నిర్మించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం షెడ్డుకు గుర్తు తెలయని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో షెడ్డుతో పాటు అందులోని సామగ్రి పూర్తి కాలిపోవడంతో, దాదాపు మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షెడ్డులో కల్లు తయారు చేయడం లేదని, కేవలం సామగ్రిని నిల్వ ఉంచామని బాధితులు తెలిపారు. కాగా గత పది రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య కల్లు పంచాయతీ నడుస్తోంది. పలు గ్రామాల్లో పోటాపోటీగా కల్లుదుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం మండల పరిధిలోని మెళచెరువులో కల్లు దుకాణానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం జమ్మిచేడులోని కల్లుదుకాణంపై కొందరు దాడి చేసి సీసాలను ధ్వంసం చేశారు. తాజాగా సోమవారం కల్లు గోడౌన్‌కు నిప్పు పెట్టడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అనుమానితులపై కేసు నమోదు

కల్లు గోడౌన్‌ను దగ్ధం సంఘటనకు సంబంధించి ముగ్గురు అనుమానితులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణ సమీపంలో ఉన్న కల్లు గోడౌన్‌ను ముగ్గురు వ్యక్తులు దగ్ధం చేసారని కృష్ణయ్య గౌడు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జడ్చర్ల, జనవరి 16: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గంగాపురం శివారులో శివాలయం సమీపంలోని మృతి చెందింది. ఇందుకు సంబంధించి జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన దూదురుకు రాములుకు ఇద్దరు భార్యలు. చిన్నభార్య కళమ్మతో వారంరోజుల క్రితం కావేరమ్మపేటకు వెళ్లారు. కాగా ఈ నెల 15న సోమవారం సాయంత్రం మంగమ్మ (50)ను కల్వకుర్తి రోడ్డులో రాములు కుమారుడు రమేశ్ వదిలి పెట్టాడు. కాగా మంగళవారం ఉదయం బహిర్భూమికి వచ్చిన రమేశ్‌కు మంగమ్మ మృతదేహం కనిపించింది. మంగమ్మ మృతిపై అనుమానం ఉందని రాములు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


జడ్చర్ల, జనవరి 16: జడ్చర్ల పట్టణంలోని గంగాపురం వెళ్లే దారిలో శివాలయం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను నిలిపి అనుమతులపై ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, ట్రాక్టర్‌కు ఎలాంటి నెంబరు ప్లేటు లేకుండా ఇసుకును అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఎస్‌ఐ తెలిపారు. పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మక్తల్, జనవరి 16 : ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఈనెల 15న రాత్రి సమయంలో రాయచూరు జిల్లా మామిడిదొడ్డి గ్రామానికి చెందిన రామలింగం (35) ఉరి వేసుకొని మృతి చెందాడు. పాఠశాల అటెండర్ కరీం గదులు శుభ్రం చేసేందుకు పాఠశాలకు రావడంతో మృతదేహం కనిపించింది. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు రామలింగం రాయచూరు జిల్లా మామిడిదొడ్డికి చెందిన వాడిగా గుర్తించారు. ఇతడికి గత మూడేళ్ల క్రితం శక్తినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొరిపేట గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు సమాచారం. కాగా వారం రోజుల క్రితం మాగనూరు మండలం కొల్పూర్ గ్రామానికి చెందిన నవితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈనెల 14న రెండో భార్య నవితతో గొడవ పడి మక్తల్‌కు వచ్చాడు. ఈ క్రమంలోనే ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి తల్లి కుర్వ ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

పాలమూరు-రంగారెడ్డికి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి

- కాంగ్రెస్ నాయకుల స్పష్టీకరణ
- తెలంగాణ ఏర్పాటులో ప్రముఖ పాత్ర
- మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి ఘననివాళి


జైపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్/విద్యావిభాగం, జనవరి 16: దివంగత కేంద్ర మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి దేశాభివృద్ధి కోసం ఎనలేని సేవలందించారని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో బిల్లు ఆమోదం కోసం కీలకంగా వ్యవహరించారని అలాంటి మహనీయుడి జ్ఞాపకార్థం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి ప్రాజెక్ట్‌గా నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం జైపాల్‌రెడ్డి 82వ జయంతిని పురస్కరించుకుని డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లావంశీచంద్‌రెడ్డి, మహబూబ్‌నగర్, మక్తల్ ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు చల్లా వంశీచంద్‌రెడ్డి, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాపేరును దేశవ్యాప్తంగా చాటినగొప్ప నేత జైపాల్‌రెడ్డి అని, మాలాంటి నాయకులకు ఆయనే స్ఫూర్తి అని కొనియాడారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు ఎలాంటి ఇబ్బందులెదురైనా ముందుగా జైపాల్‌రెడ్డి గడప తొక్కేవారని, వారి సలహాలు సూచనలు తీసుకునే వారని గుర్తుచేశారు. అలాంటిది తె లంగాణ వచ్చిన తరువాత ఆయనకు గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయన లేకపోవడం పెద్ద లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లాకొత్వాల్, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్‌ముదిరాజ్, అధికారప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు ఎన్‌పి వెంకటేశ్, సీజే బెనహర్, బెక్కరిఅనిత, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 82వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విడివిడిగా హాజరై జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మె ల్యే వంశీచందర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, డైరెక్టర్ వెంకట కిషన్, ప్రిన్సిపాల్ సుజీవన్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీఈ చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ నర్సిములు, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

- ఉమామహేశ్వర క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు


ఉమామహేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అచ్చంపేట, జనవరి 16: ఉమామహేశ్వర క్షేత్రంలోని కొండదిగువన ఉన్న భోగ మహేశ్వర క్షేత్రంలో మంగళవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్‌ల ఆధ్వర్యంలో అర్చకులు వీరయ్య, నీకంఠం, రాజశేఖర్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, రవి కుమార్‌తోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆరుగురు ప్రత్యేక అర్చకులతో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి అమ్రాబాదు జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ పట్టువస్త్రాలు సమర్పించారు. భ్రమరాంబికాదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లపు శ్రీనివాసులు ఆధర్యంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణంలో ఊరేగింపుగా బాజాభజంత్రీల మధ్య అంగరంగ వైభవంగా ఉమామహేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. అదే విధంగా నియోజక వర్గంలోని ఉప్పునుంతల, బల్మూరు, అమ్రాబాదు, లింగాల తదితర మండలాలనుంచి ప్రభలు కల్యాణానికి తరలివచ్చాయి. మంగళవారం తెల్లవారుజామున కనుల పండువగా ఉమామహేశ్వరి దేవి మల్లికార్జున స్వామివార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆయన సతీమణి అనురాధ స్వామివారి కల్యాణాన్ని జరిపించి అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. కల్యాణాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలు మూలలనుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే దంపతులు కొండపైన ఉన్న ఉమా మహేశ్వరుడ్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో ప్రబ ఊరేగింపు సందర్భంగా పట్టణానికి చెందిన కౌన్సిలర్ అప్పశివ ఆధ్వర్యంలో కాశీనుంచి వచ్చిన అఘోరాలు ఆలయ ప్రాంగణంలో వారు చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జూపల్లిలో కాటమయ్య బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

చారకొండ, జనవరి 16: మండల పరిధిలోని జూపల్లిలో గౌడ కులస్తులకు ఆరాధ్యదైవమైన కాటమయ్య స్వామికి గౌడసంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ మహిళలు బోనాలను తలపై పెట్టుకొని కాటమయ్య స్వామి దేవాలయం వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, గౌడసంఘం నాయకులు హుసేన్‌గౌడ్, దశరథంగౌడ్, వెంకటయ్యగౌడ్, శ్రీనివాసులుగౌడ్, కొండల్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, సైదులుగౌడ్, లింగయ్యగౌడ్, నరేష్‌గౌడ్, సత్యంగౌడ్, ఎల్లగౌడ్, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

లింగాల, జనవరి 16: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-14 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా లింగాల ఉన్నత పాఠశాలలో పది పూర్తి చేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడ్డ స్నేహితులు ఒక్కచోట కలుసుకోవడం వారి చిన్ననాటి అనుభూతులను నెమరువేసుకొని ఆనందోత్సవాల మధ్య గడిపారు. విద్యార్థి దశలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎంఈవో పాండు, ఉపాధ్యాయులు చెన్నయ్య, శ్యాంసుందర్, గజేంద్ర శ్రీనివాసులు, పద్మజా, అనురాధ, రామకృష్ణ, పిడి పాండులనుపూర్వపు విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులను పొందారు. ఈ సమ్మేళనంలో 70మంది పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ మాందాత ఉత్సవాలు

- హాజరైన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొని వెళుతున్న కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జనవరి 16 : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఈదమ్మమాందాత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లాపరిషత్ వైఎస్ చైర్మన్ బాలాజీ సింగ్‌లు స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్‌లు రేవతి, భూపతిరెడ్డి, పత్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, నాయకులు రాజశేఖర్, మోతీలాల్, గోపాల్‌నాయక్, రాంచంద్రయ్య, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

'బ్యానర్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దకొత్తపల్లి, జనవరి 16: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తొలగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెడ్డి సేవా సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నక్కలపల్లి గ్రామంలో సంక్రాంతి, శివరాత్రి పండుగను పురస్కరించుకుని రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసే బ్యానర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మా మనోభావాలను దెబ్బతీస్తూ బ్యానర్ తొలగించడం జరిగిందని, అట్టి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో నక్కలపల్లి రెడ్డి సేవా సంఘం సభ్యులు పి.భాస్కర్‌రెడ్డి, కే.శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మన్ననూర్, జనవరి 16: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి జడ్పీటీసీ నిధులు రూ.16 లక్షలు మంజూరయ్యాయి. గ్రామంలోని జంగాల కాలనీ, వేణుగోపాల స్వామి ఆలయం ముందర హైమాస్ట్ లైట్లను జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ సోమవారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం, మాజీ ఎంపీటీసీలు శివాజీ, శోభ, కాంగ్రెస్ నాయకులు తుల్యా, రాజారాం, వెంకటయ్య, చరణ్, సంభు వెంకట్‌రమణ, సైదులు, జూలూరి సత్యనారాయణ, శోభ, సురేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

బిజినేపల్లి, జనవరి 16 : అలివేలు మంగ సమేత వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి కోరారు. మండలంలోని పాలెంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. ఫిబ్రవరి 14న స్వామివారి కల్యాణోత్సవం, 16న రథోత్సవం, ఉద్దాల మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు నిఖిత, సొప్పరి బాలస్వామి, పెద్ద కురమయ్య, గోపాలస్వామి, శ్రీనివాసులు, అర్చకులు జయంత్, సిబ్బంది బాబయ్య, శివకుమార్ తదితరులు ఉన్నారు.

వెల్దండలో ఆర్మీ డే



ఆర్మీడే సందర్భంగా సైనికులను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ, జనవరి 16 : మండల కేంద్రంలో ఆదివారం ఆర్మీడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆకృతిగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సైనికులను స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు. దేశభద్రతలో సైనికుడిదే కీలకపాత్ర అని, ప్రజలంతా సంతోషాలతో ఉండేందుకు తమ ప్రాణత్యాగాలకు సైతం సిద్ధమయ్యి పోరాడేవారే సైనికులని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, సీనియర్ సైనికులు యెన్నం వెంకటరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పురుషోత్తమాచారి, నాయకులు రషీద్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

వంగూరు, జనవరి 17: మండలంలోని వంగూరు గేటు కాలనీలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు జువ్వ కృష్ణయ్య బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యతను, సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అంజయ్య, రామస్వామి, శ్రీనివాస్, శేఖర్‌పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు

- ఇంటి ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు

- ఊరూరా ఎద్దుల బండలాగుడు పోటీలు



ఎద్దుల బండలాగుడు పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


అచ్చంపేటటౌన్-అర్బన్, జనవరి 16: నియోజకవర్గంలోని అచ్చంపేట, లింగాల, బల్మూరు, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల్లోని గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. అన్ని పంటలు చేతి కందడంతో రైతులు జరుపుకునే ఈ పండగ చూపరులను ఆకట్టుకునేలా సాగుతుంది. బండలాగుడు, పొట్టేళ్లు, ఎడ్ల బండ్ల పరుగుపద్దెం, గానుగపోటీలతో పాటు అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఆయా గ్రామాల్లో దేవాలయాల చుట్టూ ప్రదర్శన చేశారు. సంక్రాంతి పర్వదినం తెల్లవారుజామునుంచే ఆడపడుచులు తమ ఇంటి ముంగిళ్లలో ముగ్గులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఉంచారు. చిన్నారులు యువకులు గాలిపటాలను ఎగరవేస్తూ సంతోషాలను పంచుకున్నారు. నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో బండలాగుడు పోటీల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని బహుమతులు అందజేశారు.

ప్రభ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉప్పునుంతల: సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం రాత్రి మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని శివాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఉమామమహేశ్వరం స్వామి ప్రభ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలుకుతూ శాలువాతో ఘన సన్మానం చేశారు. ఆయన వెంట నాయకులు అనంతరెడ్డి, సర్పంచ్ సరిత, శ్రీను, మమస్రష్, తదితరులు ఉన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో..

ఉప్పునుంతల మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. చెన్నకేశవస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున కోలాటాలు, బతుకమ్మల మధ్య ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానం చేశారు. అనంతరెడ్డి, నర్సింహరావు, నరేష్ తదితరులు ఉన్నారు.



మొదటి బహుమతి రూ, 20,116 నగదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



చారకొండలో ఇంటి ముందు రంగవల్లికను వేస్తున్న యువతి

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

వంగూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని రంగాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 8 ఎద్దుల జట్లు పాల్గొన్నాయి. రంగాపూర్‌కు చెందిన రైతు అల్లె లక్ష్మయ్య ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ. 20,116 బహుమతిని గెలుచుకోగా, చెర్క శ్రీనయ్యకు చెందిన ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.12,116, చెన్న ఎల్లస్వామికి చెందిన ఎద్దులు మూడవ స్థానంలో నిలిచి రూ.6,116ల బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆయన సతీమణి అమల హాజరై రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ సంధ్య, రమణరెడ్డి, చంద్రమౌళి, ఆనందరెడ్డి, లాలుయాదవ్ అంకుసురేందర్, జిలుకర సైదులు, ఆంకూరి అంజి, సాయిబాబు, శరత్‌రెడ్డి, అల్లె లక్ష్మయ్య రామస్వామి పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వంగూరు మండలంలోని అన్నారంలో చెన్న కేశవస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానికులు బండ్లు, బోనాలతో ఊరేగింపుతో ఆలయానికి వచ్చి చుట్టూ తిప్పారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉపసర్పంచ్ మెరుగు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● లింగాల: మండల కేంద్రమైన లింగాలలో, మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాహనాలను, ఎద్దుల బండ్లను అందంగా అలంకరించి మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు.

● చారకొండ: మకర సంక్రాతి పర్వదిన వేడుకలను చారకొండ మండలంలోని గ్రామాల్లో మూడు రోజల పాటు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు తమ ఇళ్లముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు, రేగిపళ్లు, నవధన్యాలు, పూలు పెట్టారు. మహిళలు పిండి వంటలు చేశారు. రైతులు తమ పాడి పశువులను అలంకరించి పూజలు చేశారు. మండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంతో పాటు ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

ఘనంగా ప్రభోత్సవం

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి శివపార్వతుల ప్రభోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై విద్యుత్తు దీపాలంకరణ నడుమ శివపార్వతుల ప్రతిమలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. సోమవారం వేకువజామున మన్ననూరు గ్రామం నుంచి ఉమామహేశ్వర కల్యాణోత్సవానికి మెట్టెలు, మాంగల్యం, తలంబ్రాలు తీసుకెళ్లారు. ప్రభోత్సవం సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభ వాహనాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ ప్టిటల సురేష్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, భరత్, అభిషేక్, శివ, కాంగ్రెస్ నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, రహీం, తుల్యా, చరణ్, సైదులు, బాబ, వెంకటయ్య, శివాజీ, లోకనాథం,శోభ, జయమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంతో పాటు మండలంలోని గుట్టలపల్లి, మేడిపూర్, సిర్సవాడ, ఐతోల్, యత్మతాపూర్, గుంతకోడూరు తదితర గ్రామాల్లో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భక్తులు ఉదయాన్నే తమ ఇళ్ల ముందు రంగవల్లులను వేయడంతో పాటు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఎద్దుల బండ్లతో ట్రాక్టర్లను అందంగా అలంకరించుకుని ఆయా గ్రామాల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో గోవిందానామస్మరణ మారుమోగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ సమద్‌పాషా మండల ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయగా జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శివలీల వారివారి గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

● కల్వకుర్తి: పట్టణంలో సోమవారం సాయంత్రం హనుమాన్ దేవాలయం వద్ద జరిగిన ఎడ్లబండ్ల ర్యాలీ ఆకట్టుకుంది. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు హాజరయ్యారు. ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై దేవాలయంలో పూజలు నిర్వహించారు. కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్రా గ్రామంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉమామహేశ్వర ప్రభోత్సవం

అమ్రాబాద్: మండల కేంద్రంలోని అమరేశ్వర ఆలయం నుంచి ఉమామహేశ్వర ప్రభోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతి యువకులు అర్ధరాత్రి వరకు సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు. అమరేశ్వర ఆలయ కమిటీ సభ్యులు వివిధ పార్టీల నేతలు భక్తులు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఊరేగింపు

కందనూలు, జనవరి 16 : శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. శ్రీపురం, బొందలపల్లి గ్రామాల నుంచి తరలి వచ్చిన ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, జేసీబీలతో ఆలయం చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెరిగిన రద్దీకనుగుణంగా ఇటీవల ఆలయం ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన రోడ్డు మీదుగా వాహనాల ఊరేగింపు ముందుకు సాగింది. భక్తులు గోవిందానామస్మరణ చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



రంగనాయకస్వామి ఆలయం చుట్టూ ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఎత్తం రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

కోడేరు, జనవరి 16 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని ఎత్తంగట్టుపై వెలసిన రామలింగేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఎత్తైన గట్టు సుమారు 2500 అడుగుల ఎత్తున కొలువైన రామలింగేశ్వరస్వామిని ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు మకర జ్యోతి వెలిగిస్తారని ఆలయ అర్చకుడు, గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సాయిశ్రీనివాస్‌రావు తెలిపారు. సంక్రాంతి మొదటిరోజు భోగి నుంచి మూడు రోజులు స్వామి వారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉమ్మడి జిల్లాతో పాటు కర్నాటక తదితర ప్రదేశాల నుంచి వస్తారన్నారు. స్వామిని దర్శించుకోవడానికి బండలు, రాళ్లు దాటుతూ సొరంగంలో దూరి వెళ్లాలన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం, మంచినీరు, వసతులు కోడేరు, ఎత్తం, కొండ్రావుపల్లి యువకులు, దాతలు కల్పించారు.



అమ్రాబాద్‌లో అమరేశ్వర ఆలయం నుంచి ఉమామహేశ్వర ప్రభోత్సవాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



గుంతకోడూరు గ్రామంలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు



మన్ననూరులో ఊరేగుతున్న శివపార్వతుల ప్రభ

సూదిని జైపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

- జైపాల్‌రెడ్డి జయంతి వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జనవరి 16 : ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సూదిని జైపాల్‌రెడ్డి దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని పాలమూరు జిల్లాకు ఆయన చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి 22వ జయంతి వేడుకలను పీవీఎన్ఆర్ మార్గ్ స్ఫూర్తి స్థల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు జైపాల్‌రెడ్డి సమాధి వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పాటించిన నైతిక విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని జూపల్లి పేర్కొన్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● అలాగే, జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునమోని రాము యాదవ్, కొల్లాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ బరిగెల రాముడు, మాజీ సర్పంచ్ నాగరాజులు దివంగత సూదిని జైపాల్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కాంతారావు, నాయకులు వేణుగోపాల్‌యాదవ్, బరిగెల సత్యనారాయణ, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● పెంట్లవెల్లి: మదనగోపాలస్వామి ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో పురాతనమైన మదనగోపాలస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనగోపాలస్వామి గోపురంపై ఉన్న పిచ్చి మొక్కలు, అదేవిధంగా ఆలయ అభివృద్ధి గురించి అధికారులతో చర్చించారు. వైస్ ఎంపీపీ భీంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గోవిందుగౌడ్, నాగిరెడ్డి, మదనగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




జైపాల్‌రెడ్డి సమాధికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

● కల్వకుర్తి: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు పీవీఎన్ఆర్ మార్గ్ స్ఫూర్తి స్థల్‌లో జైపాల్‌రెడ్డి విగ్రహానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, పలువురు నాయకులు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూదిని జైపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు చింతల రమణారెడ్డి, కాయితీ సాయిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశోక్, రాము, పరుశ రాములు, జావీద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల పరిధిలోని శిర్సనగండ్ల, జూపల్లి గ్రామాల్లో మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు ముస్తఫముజ్జుబాయి, సందీప్‌రెడ్డి, సిరాజ్, శ్రీను, జంగయ్య, ముత్యాలమ్మ, రమేష్‌రెడ్డి, పెద్దిరాజు, చెన్నయ్య, సురేందర్, జగత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, భానుచందర్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

● వెల్దండ : ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని సోమవారం మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, నాయకులు మోతీలాల్, పర్వత్‌రెడ్డి, శేఖర్, నారాయణ, నాగేష్‌గౌడ్ ఉన్నారు.



జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

ఛత్రపతి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

లింగాల, జనవరి 16: మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో శివాజీ ఛత్రపతి విగ్రహ ఏర్పాటుకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. విగ్రహ ఏర్పాటుకు గ్రామానికి చెందిన దాత రామావత్ లక్ష్మణ్‌నాయక్ ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థులు సతేశ్వరం, పర్వతాలు, చిరుత బాలరాజు, మల్లేష్, ప్రసాద్, సూర్యం, శ్రీరాం, హరీష్‌చారి, అశోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- 11కేవీ విద్యుత్ లైన్ వైరు తెగి మూడు గొర్రెలు మృతి

తాడూరు, జనవరి 16: ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైరులైన్ స్తంభంపై నుంచి తెగి పడి అక్కడికక్కడే మూడు గొర్రెలు మృతి చెందగా గొర్రెల కాపరికి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... ఐతోల్ గ్రామానికి చెందిన భీమయ్య అనే గొర్రెల కాపరి తన గొర్రెలతో ఐతోల్ గ్రామం సమీపంలో జయమ్మ అనే రైతు పొలం వద్ద గొర్రెలను మేపుతుండగా తుమ్మలసూగురు గ్రామం వెళ్లే రహదారి పక్కన ఉన్న 11కేవీ వైరు తెగిపోయింది. గమనించకుండా వచ్చిన గొర్రె పిల్లలు వైర్ తగిలి మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితిలో గొర్రెల కాపరి భీమయ్య విద్యుత్ వైర్లను గమనించగా మధ్యలో ఉండే వైరు తెగిపోవడంతో స్తంభంపై నుంచి కింద పడి ఉన్న దుస్థితిని గమనించాడు. అప్పటికే గొర్రెలు చనిపోయిన వెంటనే భూమిపై ఎండు గడ్డి ఉండడంతో ఆ ప్రాంతమంతా మంటలు అలుముకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

కల్వకుర్తి, జనవరి 16 : మండల పరిధిలోని తాండ్ర గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా తాండ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఫ్లైయింగ్ ఈగల్ టీమ్ మొదటి బహుమతి రూ.15,116ల ప్రైజ్‌మనీ గోలి సుదర్శన్‌రెడ్డి అందజేశారు. రెండవ బహుమతి తాండ్ర కింగ్స్ టీం రూ.10116ప్రైజ్ మనీ శ్రీనివాస్, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డిలు అందజేశారు. గోలి సురేందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, ఆనంద్, బాల్ జంగయ్య, తాండ్ర సీనియర్ ప్లేయర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.